క్లుప్తంగా

ఉల్లాస్ పరీక్షల తనిఖీ



పరీక్షను పరిశీలిస్తున్న వయోజన విద్య అధికారులు

ఓర్వకల్లు: వయోజన విద్య కార్యక్రమంలో భాగంగా పొదుపు మహిళలకు నిర్వహించిన ఉల్లాస్ పరీక్షలను వయోజన విద్య డీడీ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. ఆదివారం మండలంలోని హుసేనాపురం గ్రామం జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న పరీక్షలను చంద్రశేఖర్‌తో పాటు ఏపీఎం వెంకటరామిరెడ్డి, సూపర్‌వైజర్ నెమలయ్య కేంద్రాన్ని సందర్శించి, మహిళలు పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు.

గోరుకల్లులో 8 టీఎంసీల నీరు



గోరుకల్లులో నిల్వ ఉన్న నీరు

పాణ్యం : మండల పరిధిలోని గోరుకల్లు జలాశయంలో 8 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ సుభకుమార్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గోరుకల్లు నుంచి ఓటీ ద్వారా ఎస్సార్బీసీకి వెయ్యి క్యూసెక్కుల వరకు నీటికి వదులుతున్నట్లు తెలిపారు. అలాగే గ్యాలరీలో నిర్వహణ పనులు జరుగుతున్నాయని, అందులో నీల్వ ఉన్న నీటిని మోటార్ల సహాయంతో బయటకు పంపుతున్నట్లు చెప్పారు.

రూపాల సంగమేశ్వరుడి సేవలో ఎస్పీ దంపతులు



తీర్థం స్వీకరిస్తున్న ఎస్పీ దంపతులు

కర్నూలు(రూరల్): నగర శివారులోని జగన్నాథగట్టుపై వెలసిన ఉమా సమేత రూపాల సంగమేశ్వర స్వామిని ఆదివారం కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, సతీమణి కర్నూలు రెండవ బెటాలియన్ కమాండెంట్ దీపిక పాటిల్ దర్శించుకున్నారు. వారికి ఆలయ కార్యనిర్వహణ అధికారి వై.గురెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. పూజరి సురేష్ శర్మ వారిచే స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. తాలుకా అర్బన్ సీఐ శ్రీధర్ వెంట ఉన్నారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



భగత్‌సింగ్‌కు జోహార్లు అర్పిస్తున్న దృశ్యం

పాణ్యం : యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ప్రజా సంఘాలు నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక సంఘిక సంక్షేమ వసతి గృహం వద్ద భగత్‌సింగ్ 94వ వర్ధంతి సభను నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్, ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా ప్రెసిడెంట్ రాజు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. అతి చిన్న వయస్సుల్లోనే దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఉద్యమకారుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

➤ఏపీ మోడల్ వసతి గృహం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. నంద్యాల జిల్లా కార్యదర్శి ప్రతాప్ ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసిన నివాళులర్పించారు.

25న బహిరంగ వేలం

పాణ్యం : పాణ్యం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈనెల 25న మార్కెట్, బండ్ల మెట్ట, జంతువధశాలలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ ఆనందరావు ఆదివారం తెలిపారు. మంగళవారం సాయంత్రం 4గంటలకు వేలం పాట ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు మార్కెట్, బండ్లమెట్టకు రూ. లక్ష , జంతువధశాలకు రూ.5వేల డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు. అలాగే పాటదారులు గ్రామ పంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండరాదన్నారు.

ఆర్థిక సహాయం

కల్లూరు: నగరంలోని బి.టి.ఆర్ నగర్‌లో మంచానికే పరిమితమైన మహబూబ్ బాషాకు సీపీఎం 19, 20వ వార్డుల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడే వారికి ప్రభుత్వం ఆర్థికంగా సహాయం చేసి కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం నాయకులు నరసింహులు, రాధాకృష్ణ కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసుల, శీను, సుబ్బరాయుడు, సీతమ్మ, పెద్ద మాలిక్, జయన్న, ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

క్షయకు కళ్లెం పడేనా!



- గతేడాది 3,077 మందికి క్షయ నిర్ధారణ
- బాధితులు 6 నుంచి 9 నెలలు మందులు వాడాల్సిందే
- నిర్లక్ష్యం చేస్తే మొండి వ్యాధిగా రూపాంతరం
- నేడు క్షయ వ్యాధి అవగాహన దినం

కర్నూలుకు చెందిన 45 ఏళ్ల మహిళ క్షయ వ్యాధితో కోలుకోలేక కన్నుమూసింది. మందులపై సరైన అవగాహన లేక మొదట్లో కాస్త బాగా అనిపించగానే మందులు మానేసింది. ఆమెకు షుగర్ కూడా ఉండటంతో వ్యాధి తిరగబెట్టి ఎండీఆర్ టీబీగా రూపాంతరం చెందింది. తర్వాత మందులు వాడినా కోలుకోలేక మృతిచెందింది. ఈ మందులు ఎలా వాడాలో వైద్యులు, సిబ్బంది అవగాహన కల్పించకపోవడం వల్లే ఆమె కన్నుమూయాల్సి వచ్చింది.

–కర్నూలు(హాస్పిటల్)



క్షయ వ్యాధిని సూచించే చిత్రం

ఎంతో మంది క్షయ వ్యాధికి మందులు వాడుతూ మధ్యలో ఆపేసి, ఆ తర్వాత మొండి టీబీతో మరణిస్తున్నారు. క్షయ బాధితులు మొదటిసారి మందుల వాడకం ప్రారంభించగానే కొందరికి కడుపులో తిప్పుతుంది. ఇందుకోసం కొందరు వైద్యులు గ్యాస్ట్రబుల్ మందులు ఇస్తారు. మరికొందరికి తీవ్ర ఆకలి అవుతుంది. ఇంకొందరికి రెండు నెలలు మందులు వాడగానే ఆరోగ్యం కుదుట పడుతుండటంతో బాగైందని భావించి మందుల ప్రభావానికి భయపడి మానేస్తున్నారు. కానీ మందులు మధ్యలో ఆపకూడదని, కచ్చితంగా 6 నుంచి 8 నెలలు వాడాలని చెప్పేవారు లేరు. గతంలో లాగా డాట్స్ విధానంలో ఇచ్చే మందుల పద్ధతి కూడా ఇప్పుడు లేకపోవడంతో రోగుల్లో తీవ్రత పెరిగిపోతోంది. నేడు వరల్డ్ టీబీ డే (ప్రపంచ క్షయ వ్యాధి అవగాహన దినం) సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో ప్రతి 2 లక్షల నుంచి 2.5 లక్షల జనాభాకు ఒక టీబీ యూనిట్ చొప్పున 9 యూనిట్లు ఏర్పాటయ్యాయి. ఇందులో ఒక సీనియర్ టీబీ సూపర్‌వైజర్, సీనియర్ ల్యాబ్ సూపర్‌వైజర్ విధులు నిర్వహిస్తున్నారు. రోగులను పర్యవేక్షించేందుకు ప్రతి సూపర్‌వైజర్‌కు ఒక మోటార్ సైకిల్ ఇచ్చారు. దీంతో పాటు ప్రతి పీహెచ్‌సీలో ఎక్స్‌రే యూనిట్లు ఉన్నాయి. వీటి ద్వారా క్షయ నిర్ధారణ చేయవచ్చు. గతేడాది 78,368 మందికి పరీక్షలు చేయగా 3,077 మందికి క్షయ నిర్ధారణ అయ్యింది. గత కేసులతో కలుపుకొని మొత్తం 4,571 మందికి చికిత్స అందిస్తున్నారు. వీరికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు 6 నుంచి 8 నెలల పాటు ఉచితంగా అందిస్తారు. గతేడాది క్షయ నుంచి కోలుకోలేక 104 మంది మరణించారు.

వ్యాధినిర్ధారణ ఇలా !

రెండు వారాలకు మించి దగ్గ, సాయంత్రం వేళల్లో జ్వరం, దగ్గితే గళ్ల పడటం, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం, ఉమ్మిలో రక్తం పడటం వంటి లక్షణాలుంటే క్షయగా అనుమానించి సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్ష చేయించుకోవాలి. రోగి గళ్లను వైద్య సిబ్బంది సేకరించి మైక్రోస్కోప్, ట్రూనాట్, సీబీనాట్ మిషన్‌ల ద్వారా నిర్ధారిస్తారు.

పెరుగుతున్న ఎండీఆర్‌టీబీ కేసులు

క్షయవ్యాధిలో మల్టీ డ్రగ్ రెసిస్టెన్స్ టీబీ (ఎండీఆర్‌టీబీ) కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. క్షయ మందులపై అవగాహన లేక చాలా మంది కోర్సు మధ్యలోనే మానేస్తున్నారు. దీనివల్ల వ్యాధి తిరగబెట్టి మరింత మొండిగా తయారవుతోంది. అప్పుడు సాధారణ టీబీ మందులు పనిచేయవు. వారికి ఖరీదైన ఎండీఆర్ టీబీ మందులు ఇవ్వాల్సి ఉంటుంది. వీటి ఖరీదు రూ.2 లక్షల దాకా ఉంటుంది. ఈ మందులకు కూడా లొంగకపోతే బెడాక్విలిన్ అనే రూ.18 లక్షల విలువైన 11 నెలల కోర్సు మందును ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎండీఆర్ టీబీ రోగులు 135 మంది ఉండగా, బెడాక్విలిన్ మందులు వాడే వారు 52 మంది ఉన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత మందులతో పాటు రోగి పోషకాహారం కోసం నెలకు రూ.వెయ్యి అందిస్తున్నారు.

నిక్షయ్ మిత్ర ద్వారా సరుకులు

నిక్షయ్ మిత్ర ద్వారా కో–ఆపరేటివ్, కార్పొరేట్, ప్రజాప్రతినిధులు, దాతల ద్వారా క్షయ రోగులకు అవసరమైన పోషకాహార కిట్లను అందిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 129 సంస్థలు రిజిస్టర్ కాగా 2,117 మంది క్షయ రోగులను దత్తత తీసుకుని 12,045 పోషకాహార ప్యాకెట్లను అందజేశారు.

నేడు అవగాహన సదస్సు

ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలులో ఈ నెల 24వ తేదీన ర్యాలీ నిర్వహించనున్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నారు. క్షయ వ్యాధిపై వైద్య, ఫార్మసీ విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం చేయనున్నారు.

గత ఐదేళ్లుగా టీబీ కేసుల వివరాలు

సంవత్సరం	నమోదైన టీబీ కేసులు	ఎండీఆర్ టీబీ కేసులు	టీబీ, హెచ్ఐవీ కేసులు
2020	1,974	116	152
2021	2,668	167	183
2022	2,700	164	156
2023	2,651	79	103
2024	3,077	135	113

క్షయను తగ్గించడమే లక్ష్యం



జిల్లాలో ప్రస్తుతం ప్రతి 3 వేల మందికి పరీక్ష చేయగా 170 దాకా కేసులు బయటపడుతున్నాయి. ఈ సంఖ్యను 50లోపు తగ్గించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఒకరి నుంచి మరొకరికి వ్యాధి సోకకుండా చర్యలు తీసుకుంటున్నాం. వ్యాధిసోకిన వారి ఇంట్లో అందరికీ టీబీ ప్రివెంటివ్ థెరపీ కింద ఆరు నెలల పాటు మందులు ఉచితంగా ఇస్తున్నాం. ఇటీవల పెద్దవారికి కూడా వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది.

–డాక్టర్ ఎల్.భాస్కర్, జిల్లా క్షయ నియంత్రణాధికారి, కర్నూలు

పరిష్కార వేదికకు అధికారులందరూ హాజరవ్వాలి

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. ఆయన ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడిస్తూ.. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో కలిసి పీజీఆర్ఎస్ కార్యక్ర మం నిర్వహించడం జరుగుతుందని, కార్యక్రమానికి హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని స్పష్టం చేశారు. మండల ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండలంలోని దివ్యాంగుల ఉపయోగార్థం నిర్వహించే ఫిజియోథెరపీ శిబిరాన్ని దివ్యాంగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ప్రకటన ద్వారా సూచించారు. స్థానిక మండల భవిత కేంద్రంలో ప్రతి సోమవారం దివ్యాంగుల శారీరక అవయవాలకు వైద్యుడు వీరేష్‌చే ఫిజియోథెరపీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు తమ కుటుంబంలోని దివ్యాంగులను భవిత కేంద్రానికి తీసుకొచ్చి ఫిజియోథెరపీ చేయించాలని సూచించారు.

చెత్త దిబ్బలను తొలగించాలి

కల్లూరు: గోవర్ధన్ నగర్ రైతు బజార్ ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న చెత్త దిబ్బలను తొలగించాలని సీపీఎం నగర కార్యదర్శి సుధాకరప్ప డిమాండ్ చేశారు. ఆదివారం కల్లూరు అర్బన్ 35వ వార్డులో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ గోవర్ధన్ నగర్‌లోని రైతు బజార్‌కు ఎదురుగా ఉన్న రోడ్డు వెంట ఇందిరమ్మ కాలనీ, శ్రీనివాస నగర్, ఉమామహేశ్వరి నగర్, ఫరూక్ నగర్ తదితర కాలనీలకు ఇదే రోడ్డు వెంట వెళ్లాలన్నారు. వర్షకాలంలో ఈ రోడ్డు బురదమయంగా మారుతుందన్నారు. అధికారులు స్పందించి నూతన రోడ్డును నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆనంద్, రామాంజనేయులు, బీసన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా ఏయే గ్రామాల్లో నీటి కొరత వస్తుందో గుర్తించి ప్రణాళిక రూపొందించి అందుకు ప్రత్యామ్నాయంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ బోయ శారద అధ్యక్షతన, ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గంలో 16 కోట్ల జాతీయ ఉపాధి హామీ పథకం పనులు జరిగాయన్నారు. మండలంలో అభివృద్ధి పనులు ఆటంకం లేకుండా చేస్తామన్నారు. ముందుగా మండల స్థాయి అధికారులందరు శాఖల వారీగా ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే పనులు చేయాలని ప్రజాప్రతినిధులు సభలో కోరారు. పని ప్రదేశంలో వేతనదారులకు తాగునీరు అందించాలని, టెంట్‌లు ఏర్పాటు చేయాలని ఎంపీపీ శారద అధికారులకు సూచించారు.

- జాతీయ ఉపాధి హామీ పథకం లక్ష్యం నేరవేరడం లేదని నాయకల్లు ఎంపీటీసీ చంద్రారెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో పనులకు రాని వారికి కూడా మస్టర్‌లో హాజరు వేసుకుంటున్నారని ఆరోపించారు.
- ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ఎంత మంది పొదుపు మహిళలను అక్షరాస్యులుగా తీర్చిద్దారని పెద్దటేకూరు ఎంపీటీసీ మునిస్వామి సభలో అధికారులను అడిగారు. పెద్దటేకూరులో ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి హెల్త్ సబ్ సెంటర్ స్థలాన్ని కేటాయించాలని కోరారు.
- పర్లలో బీసీ కాలనీలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని సమస్యను పరిష్కరించాలని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించాలని ఎంపీటీసీ మేకల శేషన్న సభ దృష్టికి తీసుకువచ్చారు.
- గ్రామాల్లో పాత ఇళ్ల స్థానంలో కొందరు కొత్తగా ఇళ్లు నిర్మింకుంటున్నారని, వాటికి ఎలాంటి షరతులు లేకుండా రెవెన్యూ అధికారులు పొజిషన్ సరిఫికేట్ ఇవ్వాలని సల్కాపురం సర్పంచ్ మద్దిలేటి అధికారులను కోరారు.
- కె. మార్కాపురంలో సమస్యలు తీష్ట వేశాయని సర్పంచ్ గణ మద్దిలేటి సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామీణ పశు వైద్యశాలలకు పశు వైద్యులు హాజరుకావడం లేదని ఇదివరకు రెండు సర్వసభ్య సమావేశాల్లో సభ దృష్టికి తీసుకువచ్చానని, ఇప్పుడు మూడవ సారి తీసుకువస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. పశువైద్యశాలలో పశువులకు వైద్యం చేయడానికి కనీసం అటెండర్‌నైనా ఏర్పాటు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో క్లాప్ మిత్రలను తొలగించి, వారికి సంబంధించిన వారిని నియమించుకున్నారని అయితే ఎక్కడా పారిశుద్ధ్య పనులు జరగడం లేదన్నారు. బీసీ కాలనీలో విద్యుత్ బల్బులు వెలగడం లేదని ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఏపీ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి



భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు : గ్రామీణ ప్రజలకు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కేతవరం గ్రామంలో భగత్‌సింగ్ సుఖదేవ్ రాజు 94వ వర్ధంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ కార్యదర్శి నరేష్ అధ్యక్షతన జరిగిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనగా మైక్యూర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రమాదేవి, డాక్టర్ ఆసియా, మేనేజర్ ప్రాణేష్ ప్రజలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ కమిటీ అధ్యక్షులు శ్రీధర్, నాయకులు సూర్యనారాయణ, రంగస్వామి, బుగ్గరాముడు, డీవైఎఫ్ఐ గ్రామ నాయకులు శేషాద్రి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

గడివేముల: స్థానిక తహసీల్దార్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటరమణ ఆదివారం తెలిపారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని రైతులకు సమస్యలు ఉంటే అర్జీ రూపంలో తమకు అందజేయాలన్నారు. వచ్చిన అర్జీలను ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి పరిష్కరిస్తామన్నారు.

నేడు నగరపాలకలో..

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ కాలనీలలో నెలకొన్న సమస్యలపై అర్జీలు అందజేయవచ్చన్నారు. అర్జీదారులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్‌తో హాజరు కావాలని సూచించారు.


ప్రమాదకరంగా వంక



కంచెలేక ప్రమాదకరంగా ఉన్న వంక

కోడుమూరు రూరల్: మండలంలోని పులకుర్తి గ్రామంలో సుంకులమ్మ వంకకు కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. వంక నిత్యం నీటితో ఉంటుండడంతో పిల్లలు సరదాగా ఈత కొట్టేందుకు వంకలోకి దిగుతున్నారు. వంకలో భారీగా గోతులుండడం వల్ల లోతు తెలియని చిన్నారులు నీట మునిగి మృత్యువాత పడుతున్నారు. గతేడాది ఇలాగే ఓ బాలుడు చనిపోగా శనివారం గ్రామానికి చెందిన సత్యన్న, మల్లీశ్వరీ దంపతుల పెద్ద కుమారుడు వరుణ్‌సాయి (7) నీట మునిగి చనిపోయాడు. వంక గ్రామానికి సమీపంలోనే ఉండడం, వంకలోకి దిగకుండా ఉండేందుకు ఎలాంటి కంచె లేకపోవడంతో అభంశుభం తెలియని చిన్నారులు సరదాగా నీటిలో ఆడుకునేందుకు వెళ్లి మృత్యువాత పడుతున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడం, పాఠశాలలకు సెలవులు కూడా వస్తుండడంతో పులకుర్తి వాసులు తమ పిల్లలకు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వంకలోకి దిగకుండా కంచె ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వంక చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి



గ్రామంలో సుంకులమ్మ వంకకు ఎలాంటి కంచె లేదు. వంకలో ఎప్పుడూ నీరు పారుతుండటంతో పాటు లోతు ఎక్కువగా ఉంది. వర్షాకాలంలో వంక మరింత ఉధృతంగా ప్రవహిస్తుంది. చిన్న పిల్లలు సరదాగా వంకలోకి దిగి లోతు తెలియక లోపలికి వెళ్లి నీటమునిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. అధికారులు స్పందించి వంక చుట్టూ కంచె ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– నరసింహుడు, పులకుర్తి గ్రామం, కోడుమూరు మండలం

కోడుమూరులో జింకల నుంచి కొర్ర పంటను రక్షించుకునేందుకు పొలం చుట్టూ చీరలను కట్టిన రైతు




చేనుకు చీర సొగసు

కోడుమూరు రూరల్: కోడుమూరు మండలంలో గాజులదిన్నె ప్రాజెక్టు కింద సాగు చేసిన ఆరుతడి పంటలను జింకల నుంచి రక్షించుకునేందుకు రైతులు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. ఆరుతడి పంటలుగా సాగు చేసిన కొర్ర, మొక్కజొన్న పంటలను జింకలు నాశనం చేస్తున్నాయి. ఈ క్రమంలో జింకలు కొర్ర పొలంలోకి రాకుండా నిరోధించేందుకు నవీన్‌కుమార్ రెడ్డి అనే రైతు పొలం చుట్టూ కర్రలు పాతి పాత చీరలను కంచెగా కట్టాడు. ఇలా కట్టడం వల్ల పొలంలోకి జింకల రాక తగ్గిందని రైతు తెలిపారు. అలాగే మరికొందరు రైతులు తమ పొలాల్లో.. జంతువులు, మనుషుల అరుపులు వచ్చే విధంగా మైకులను ఏర్పాటు చేసుకుని జింకలు బెదిరిపోయే విధంగా చేస్తూ పంటలను రక్షించుకునేందుకు పాట్లు పడుతున్నారు.

వడ్లోని వంక వరద నుంచి ప్రజలను కాపాడాలి

కల్లూరు : వడ్లోని వంక వరద నుంచి ప్రజలను కాపాడలని సీపీఎం న్యూ సిటీ కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. ఆదివారం కల్లూరు అర్బన్ 36వ వార్డు పెద్దపాడులో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించి ప్రజలతో కలసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వడ్లోని వంక ఆక్రమణకు గురవుతుండటం వలన వర్షాకాలంలో వరద నీరు ఎస్సీ కాలనీలోకి వస్తుందన్నారు. దీంతో కాలనీలోని ప్రజలు సర్వం కోల్పోతున్నారన్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్త చెదారం ఉందని, శిథిలమైన రోడ్లు, డ్రైనేజీ కాలువలు అధికారుల పట్టించుకోవడం లేదన్నారు. వారానికి ఒక్కసారి మాత్రమే తాగునీరు వస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపినాథ్, కృష్ణ, రమేష్, నాగార్జున, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఊటలతో రైతులకు ఇక్కట్లు



ఊట నీరు దిగువకు వస్తున్న దృశ్యం

పాణ్యం : మండల పరిధిలోని కొండజుటూరు గ్రామం వద్ద ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ వద్ద ఊటల ద్వారా వచ్చే నీటితో దిగున రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాల్వ పక్కనే ఊటల రూపంలో నీరు దిగువకు వస్తోంది. ఈ నీరు పొలాల మీదుగా చెరువులోకి వెళ్తుంది. ఈ క్రమంలో రైతులు పంటలను సాగు చేసుకోవాలంటే నీటితో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పంట దిగుబడి చేతికొచ్చిన తరుణంలో నీటి వలన అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సార్బీసీ అధికారులు చర్యలు తీసుకొని ఊటలను నియంత్రించాలని రైతులు కోరుతున్నారు. లేకుంటే నీటి వృథాతో పాటు పంటలకు ఇబ్బంది మారుతాయన్నారు.



ఎస్సార్బీసీ కాల్వ వద్ద నీటి ఊట